ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 6 జనవరి 2025



మత్స్యకారుల వలలో భారీ వేల్‌షార్క్!

- రెండున్నర టన్నులకుపైగా బరువు
- తిరిగి సముద్రంలోకి నెట్టలేక.. తీరంలోనే వదిలేసిన మత్స్యకారులు



.... మెయిన్‌లో

రంగవల్లుల సందడి



ప్రథమ బహుమతికి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత వరలక్ష్మి




ద్వితీయ బహుమతికి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత అన్నపూర్ణ





తృతీయ బహుమతికి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత యశ్విత

అనకాపల్లిలో ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-'ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు
- రకరకాల ముగ్గులతో వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయం
- పట్టణానికి ముందస్తుగానే సంక్రాంతి పండుగ



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

అనకాపల్లిటౌన్/కొత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణానికి తొమ్మిది రోజులు ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చేసింది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగోసెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు రంగవల్లులు, గొబ్బెమ్మలు, రంగురంగుల పూలతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. స్థానిక స్పాన్సర్‌గా కొణతాల సుబ్రహ్మణ్యం అప్పలనర్సమ్మ ట్రస్టు వారు వ్యవహరించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముగ్గుల పోటీలకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 58 మంది మహిళలు, యువతులు ముగ్గుల పోటీల్లో పాలుపంచుకున్నారు. సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా, తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పలు రకాల ముగ్గులు వేశారు. రకరకాల ముగ్గులతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణాన్ని తలపించింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ముగ్గుల పోటీలు ఒంటి గంటకు ముగిశాయి. అనంతరం న్యాయనిర్ణేతలు ప్రతీ ముగ్గును నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. అనకాపల్లి గవర పాలెం నీలకంఠరావు వీధికి చెందిన బి.వరలక్ష్మి ప్రథమ బహుమతికి (రూ.6 వేలు), తుమ్మపాలకు చెందిన సిహెచ్.అన్నపూర్ణ ద్వితీయ బహుమతికి (రూ.4 వేలు), కశింకోట అమిరపల్లి వీధికి చెందిన కె.యశ్విత తృతీయ బహుమతికి (రూ.3 వేలు) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమానికి ఎ.డి. ఇంగ్లీషు మీడియం స్కూలు అధినేత కొణతాల రఘునాథ్, డైరెక్టర్ పీలా అనుష సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ హాజరై విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందించారు.

..... మరిన్ని ఫొటోలు, వార్త 8వ పేజీలో



మొదటి బహుమతి విజేత బి.వరలక్ష్మికి రూ.6 వేల నగదు, జ్ఞాపికను అందజేస్తున్న కొణతాల రఘునాథ్. చిత్రంలో ఎ.డి. ఇంగ్లీషు మీడియం స్కూలు డైరెక్టర్ పీలా అనుష సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జి.లక్ష్మి, న్యాయనిర్ణేత లీలావతి, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ఎం.వెంకట్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి జె.శ్రీనివాస్

ప్రధాని మోదీ సభ చిరస్మరణీయంగా నిలవాలి

దేశం మనవైపు చూసేలా నిర్వహించాలి

- సమన్వయంతో విజయవంతం చేయాలి
- 3 లక్షల మందిని తరలించేలా చర్యలు
- రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞత తెలిపేలా విశాఖలో నిర్వహణ
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో మంత్రి నారా లోకేశ్
- గణబాబుకు రోడ్ షో, పల్లాకు సభ పర్యవేక్షణ బాధ్యతలు



విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల ఎనిమిదో తేదీన నిర్వహించనున్న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ చిరస్మరణీయంగా నిలిచేలా నేతలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రధాని రోడ్ షో, సభ ఏర్పాట్లపై ఆదివారం విశాఖ కలెక్టరేట్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక రీతిలో సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా విశాఖలో ప్రధాని సభ జరగాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని ... మిగతా 6వ పేజీలో



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కూటమి నేతలు, అధికారులు

ప్రధాని పర్యటన షెడ్యూల్

విశాఖపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల ఎనిమిదో తేదీని నగరానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన వివరాలను ప్రధానమంత్రి కార్యాలయం ఆదివారం విడుదల చేసింది. ఎనిమిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాని ప్రత్యేక విమానంలో బయలుదేరి, మధ్యాహ్నం 4.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 4.20 గంటలకు రోడ్డుమార్గంలో తాటిచెట్లపాలెం జంక్షన్, తెలుగుతల్లి ఫ్లైఓవర్, దత్ ఐలాండ్ జంక్షన్ మీదుగా ఏయూ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న వెంకటాద్రి వంటిల్లు వద్దకు 4.25 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి ఓపెన్ టాప్ వాహనంలో రోడ్‌షో నిర్వహిస్తూ ఏయూ ఇంజనీరింగ్ మైదానంలోని వేదిక వద్దకు సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. 6.30 గంటల వరకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించిన అనంతరం బహిరంగసభలో మాట్లాడుతారు. 6.35 గంటలకు ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుంచి రోడ్డుమార్గంలో ఎయిర్‌పోర్టుకు చేరుకుని, రాత్రి 7 గంటలకు ప్రత్యేక విమానంలో భువనేశ్వర్ వెళతారు.

చోడవరంలో రైతు బజార్

- వచ్చే నెలలో అందుబాటులోకి..
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వెల్లడి



రైతు బజార్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కే ఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రైతు బజారు నిర్మాణం ఫిబ్రవరి నాటికి పూర్తి చేసి రైతులకు, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. ఇక్కడ అసంపూర్తిగా వున్న రైతు బజారు భవనాల నిర్మాణ పనులను ఆయన ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతు బజారు నిర్మాణం పూర్తికి అవసరమైన నిధులు మంజూరు అయ్యాయని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. ఫిబ్రవరినాటికి అందుబాటులోకి తీసుకువచ్చి ... మిగతా 6వ పేజీలో

మినుము పంటపై తెగుళ్ల దాడి

పల్లాకు తెగులుతో పసుపు రంగులోకి ఆకులు

- పొగాకు లద్దె పురుగుతో ఎండిపోతున్న పంట
- ఆందోళన చెందుతున్న రైతులు
- నివారణ చర్యలు సూచిస్తున్న కేవీకే శాస్త్రవేత్త రాజ్‌కుమార్



మత్స్యపురంలో పల్లాకు తెగులు సోకిన మినుము



చినపాచిలలో బూడిద తెగులు ఆశించిన మినుము పంట

రావికమతం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పూత దశలో వున్న మినుము పంటలను పలు రకాల తెగుళ్లు సోకవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పసుపు రంగు మొజాయిక్ తెగులు మందులు పిచికారీ చేసినా తగ్గడం లేదని వాపోతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన పొలాల్లో రైతులు.. పంట కోత అనంతరం రబీలో మినుము, పెసర, బొబ్బర వంటి పప్పుదినుసుల పంటలను వేశారు. కొమిర,మత్స్యపురం, చినపాచిల, కేబీపీ అగ్రహారం, బుడ్డిబంద, కవ్వగుంట, గర్నికం, మేడివాడ, మట్టవానిపాలె, గొల్లలపాలెం తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో మినుము వేశారు. ప్రస్తుతం అన్నిచోట్లా మినుము మొక్కలు పూత దశకు చేరుకున్నాయి. అయితే వాతావరణంలో మార్పులతోపాటు భూమిలో కొన్ని రకాల పోషకాలు లోపించడంతో పలు రకాల తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా పల్లాకు తెగులు (ఎల్లో మొజాయిక్), బూడిద రంగు తెగులు, పొగాకు లద్దె పురు గు ఆశించాయి. ఎల్లో మొజాయిక్ తెగులు ఆశించిన పొలాల్లో మినుము ఆకులు గిడసబారి పసుపు రంగులోకి మారితున్నాయి. ఒక మొక్కకు సోకిన తెగులు రోజుల వ్యవధిలోనే పొలం మొత్తం విస్తరిస్తున్నది. మందు పిచికారీ చేసినా ఉపయోగం ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక బూడిద తెగులు ఆశించిన పొలాల్లో మినప మొక్కపై తెల్లటి మచ్చలు ఏర్పడి, ఎండిపోతున్నాయి. ఈ తెగుళ్ల కారణంగా ... మిగతా 6వ పేజీలో

బీచ్ హ్యాండ్‌బాల్ విజేత విశాఖ

రెండో స్థానంలో కర్నూలు, మూడో స్థానంలో ప్రకాశం..



ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

అచ్యుతాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం మండలం పూడిమడకలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన తుది పోటీల్లో కర్నూలుపై విశాఖ జట్టు గెలుపొంది ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. రెండో స్థానంలో కర్నూలు, మూడో స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. విజేత జట్లకు జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌చార్జి సుందరపు సతీశ్ కుమార్ షీల్డ్‌తోపాటు క్రీడాకారులకు వ్యక్తిగత మెడల్స్ పంపిణీ చేశారు. ఎలమంచిలి జనసేన పార్టీ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సొంత నిధులతో రాష్ట్రస్థాయి బీచ్ హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు.

వైరస్‌తో పందెం కోళ్లు విలవిల


పెంపకందారులకు నష్టాలు

కోటవురట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పందెం కోళ్లపై వైరస్ దాడి చేస్తోంది. రాణికేట్(కొక్కెర వ్యాధి), ఇతర వైరస్‌ల బారిన పడి అవి మృత్యువాత పడుతున్నాయి. దీంతో పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మండలంలోని తంగేడు, లింగాపురం, కైలాసపట్నం, టి.జగ్గంపేట, పందూరు, సుంకపూర్, కె.వెంకటాపురం, తదితర గ్రామాల్లో గత నవంబరు, డిసెంబరులో వాతావరణంలో మార్పుల కారణంగా కోళ్లకు ఆర్‌డీ వైరస్, ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకాయి. దీని వల్ల కోడి పుంజులు, పెట్టలు, పిల్లలు సుమారు 600 వరకు మృత్యువాత పడినట్టు సమాచారం. తంగేడు గ్రామానికి చెందిన ఓబ్బులు రెడ్డి సతీశ్ ప్రతి సంక్రాంతికి 20 నుంచి 30 కోడి పుంజులను పెంచి విక్రయిస్తుంటాడు. అయితే ఈ ఏడాది వైరస్ వల్ల అతని వద్ద గల 13 పందెం కోళ్లు మృతి చెందాయి. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ వైరస్ వల్ల కోళ్లు చనిపోతున్నాయని కోటవురట్ల పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేశ్ తెలిపారు. కోళ్లకు మెడ ఒకవైపు తిరిగినట్టు ఉండడం, ఆకు పచ్చని రెట్ట ఈ వ్యాధి లక్షణాలని ఆయన చెప్పారు.



లింగాపురంలో చనిపోయిన నాటుకోడి



తంగేడులో చనిపోయిన పందెం కోడిపుంజు

చోడవరంలో రైతు బజార్

... 5వ పేజీ తరువాయి

రైతులకు, చిరువ్యాపారులకు దుకాణాలు కేటాయిస్తామన్నారు. దీనిని మోడల్ రైతు బజారుగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో పంచాయతీ దుకాణాల పైభాగంలో కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే ఆలోచన ఉందని తెలిపారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీనివాసరావు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభ చిరస్మరణీయంగా నిలవాలి

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్నారని, ఈ సందర్భంగా మూడు పార్టీల నేతలు, ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గతంలో విజయవాడలో నిర్వహించిన సభను మించి యావత్‌దేశం మనవైపు చూసేలా విశాఖ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభకు కనీసం మూడు లక్షల మంది హాజరయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అధిక నిధులు కేటాయిస్తోందని, అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోందని, మోదీ సభను విజయవంతం చేయడం ద్వారా దానికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. రోడ్‌షో ద్వారా ప్రధాని ప్రజలను పలుకరించనున్నారని, ప్రజలంతా ప్రధాని కాన్వాయ్‌కి చేరువగా ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందిలేకుండా రోడ్‌షో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేతలకు బాధ్యతల అప్పగింత

ప్రధాని మోదీ వెంకట్రాది వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభా వేదిక వరకు రోడ్‌షో నిర్వహిస్తారని, ఆయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. రోడ్‌షో బాధ్యతలను విప్ గణబాబుకు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. మిగిలిన నేతలంతా వారికి సహకరించాలన్నారు. ప్రధాని సభ చారిత్రాత్మకమని, ఈ మూడు రోజులు ప్రజా ప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని నిర్దేశించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంకుబ్రాత బాగ్చీ మంత్రికి వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీవీఐపీ, వీఐపీ వాహనాలు, సభకు తరలివచ్చే ప్రజల వాహనాలకు 26 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

మినుము పంటపై తెగుళ్ల దాడి

... 5వ పేజీ తరువాయి

పూత రాలిపోతున్నదని ఆందోళన చెందుతున్నారు. కాగా మినుము పంటను సోకిన తెగుళ్ల నివారణ గురించి కోమళ్లపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్‌ను సంప్రదించగా.. విత్తన శుద్ధి చేయకపోవడం వల్ల తెగుళ్లు ఆశిస్తున్నట్టు చెప్పారు. పొగాకు లద్దెపురుగు ఆశించిన, పల్లాకు తెగులు సోకిన మొక్కలను పీకివేసి, దూరంగా తీసుకెళ్లి దహనం చేయాలని సూచించారు. అనంతరం పొగాకు లద్దె పురుగు నివారణకు క్లోరీపైరిపాస్ లేదా మోనోక్రోటోపాస్ మందును లీటరు నీటికి 1.6 ఎం.ఎల్. చొప్పున కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే ఐదు కిలోల తవుడులో అర కిలో బెల్లం, అర లీటర్ మోనోక్రోటోపాస్ మందు కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి తెగులు ఉన్న ప్రదేశాల్లో వేయాలని, పొగాకు లద్దె పురుగులు వీటిని తిని చనిపోతాయన్నారు. పల్లాకు తెగులు తెల్లదోమ వల్ల వస్తుందని, పొలంలో ముందుగా ఈ మొక్కలు పీకివేసి అనంతరం థయోమిథోయేట్ మందు లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

వెటరన్ అథ్లెట్ ముత్యం లక్ష్మికి ఆర్థిక సాయం

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెటరన్ క్రీడా పోటీలకు ఎంపికైన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మికి స్థానిక సద్భావ టీం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈనెల 31 నుంచి మూడు రోజులపాటు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి వెటరన్ క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న ముత్యం లక్ష్మికి చార్జీల కోసం రూ.18 వేలు అందించారు. సబ్ రిజిస్ట్రార్లు మోహనరావు,నారాయణరావు, నరసయ్యపేట సర్పంచ్ నాగబాబు, సద్భావ టీం సభ్యులు గీతాలక్ష్మి, కొప్పాక రాజేశ్, గనిరెడ్డి, ఉప్పల రజని, కె.చలపతి పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జొన్నాడ

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గానికి చెందిన క్రీడాకారుడు జొన్నాడ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి జిల్లా తరపున శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శ్రీనివాసరావుకు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పుణ్యకోటి వాహనంపై పుండరీకాక్షుడు



నక్కపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో అర్చకుల బృందం ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం పుణ్యకోటి వాహనంపై ఉత్సవమూర్తులను, పల్లకీపై గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని మాడవీధుల్లో ఊరేగించారు. అనేక మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

పరశురాముడుగా పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి దేవ స్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పరశురామావతారంలో పాండురంగస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం పరశురామునిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పొంచి ఉన్న ముప్పు

- కూలడానికి సిద్ధంగా శిథిల తుఫాన్ భవనాలు
- పాఠశాలలకు ఆనుకొని ఉండడంతో టెన్షన్
- ఆందోళనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు
- వాటిని తొలగించాలని డిమాండ్
- ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ



రత్నయ్యమ్మపేట పాఠశాలను ఆనుకుని ఉన్న శిథిల తుఫాన్ భవనం



రాజానగరంలో జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల తుఫాన్ భవనం

(ఆంధ్రజ్యోతి-పాయకరావుపేట రూరల్)

పాఠశాలలకు ఆనుకొని ఉన్న శిథిల తుఫాన్ భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు పలు పర్యాయాలు ఫిర్యాదులు చేసినా అధికారులు బుట్టదాఖలు చేశారు. ఈ భవనాలు కూలితే విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

మండలంలోని వెంకటనగరం, రాజానగరం, కుమారపురం శివారు రత్నయ్యమ్మపేట గ్రామాలలో పాఠశాలల ఆవరణలలో ఉన్న శిథిల తుఫాన్ రక్షిత భవనాలతో విద్యార్థులకు ప్రమాదం పొంచి వుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన తుఫాన్ రక్షిత భవనాలు ప్రస్తుతం పూర్తిగా శిథిల స్థితికి చేరుకుని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. శిథిల స్థితికి చేరడంతో వీటిని పూర్తిగా వినియోగించకుండా వదిలేశారు. ఇవి పాఠశాలలను ఆనుకుని ఉండడంతో విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భయపడుతున్నారు. శిథిల భవనాల పక్కనే విద్యార్థులు ఆటలాడుకోవడం, తిరుగుతుండడంతో భవనాల పెచ్చులూడి మీద పడినా, భవనాలు కూలినా విద్యార్థులకు ప్రమాదం సంభవించే అవకాశం వుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాలను తొలగించాలని కొన్ని సంవత్సరాలుగా సర్పంచులు వంకా వెంకటరమణ, పెరుమళ్ళ గోవిందమ్మ, గ్రామస్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో, స్పందనలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ వెంకటరమణ అన్నారు. ఎంఈఓ, ఎంపీడీవో తదితర అధికారులు పర్యటించి, శిథిల భవనాలను పరిశీలించారు. ఉన్నతాధికారులకు అనుమతుల కోసం పంపిస్తున్నామని చెబుతున్నారు గానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో ఒక సమయంలో పిల్లలు శిథిల భవనాల సమీపంలోకి వెళుతున్నారని ఏమైనా జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అధికారులు భవనాలను తొలగించడానికి అనుమతులు ఇస్తే పంచాయతీ నిధులతో తొలగిస్తామని సర్పంచులు కోరుతున్నారు.

ఎన్ని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు

వంకా వెంకటరమణ, సర్పంచ్, వెంకటనగరం



పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల తుఫాన్ రక్షిత భవనాలను తొలగించాలని పలుమార్లు స్పందన, మండల సమావేశంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారులకు పంపించామంటున్నారే తప్ప భవనాల తొలగింపునకు అనుమతులు ఇవ్వడం లేదు. విద్యార్థులకు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఈ భవనాలు ఎప్పుడు కూలతాయోనని భయంతో ఉన్నాం. అనుమతులు ఇస్తే పంచాయతీ నిధులతో భవనాలను తొలగించుకుంటాం.

గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనకు ఏర్పాట్లు

అచ్యుతాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఎనిమిదో తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్న ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కి పూడిమడక వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ 1500 ఎకరాల్లో ఈప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. దీనిని గత నెల 29వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా పడింది. ఈ ప్రాజెక్టును ఈనెల 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌లో శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అచ్యుతాపురం-పూడిమడక ప్రధాన రోడ్డు నుంచి ప్లాంట్ ప్రహరీ వరకు రోడ్డు వేస్తున్నారు. ఎన్‌టీపీసీకి కేటాయించిన స్థలంలో స్టేజ్‌తో పాటు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సుమారు వెయ్యి మందికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్‌జీఈఎల్ డీడీ వండా, ఎన్‌టీపీసీ జీఎం (ఒఅండ్‌ఎం)పీకే జన, ఎన్‌జీఈఎల్ డీజీఎం బాలాజీ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈనెల ఎనిమిదో తేదీ సాయంత్రం మూడు గంటల నుంచి ఆరున్నర గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు.



సభా వేదిక, స్టాల్స్‌కు వేసిన టెంట్లు

దుమ్ము, ధూళితో ఇక్కట్లు

- రాంబిల్లి ప్రధాన రోడ్డులో అదే పరిస్థితి
- అనారోగ్యానికి గురవుతున్న వాహనదారులు, ప్రజలు



రాంబిల్లి రోడ్డులో ధూళిని వెదజల్లుతూ వెళుతున్న భారీ లారీ

రాంబిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటాపురం జంక్షన్ నుంచి రాంబిల్లి మీదుగా వాడనర్సాపురం వెళ్లే ప్రధాన రోడ్డులో భారీ వాహనాల తీవ్రతకు దుమ్ము, ధూళి ఎగసిపడుతుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాడనర్సాపురం సమీపంలో ఎన్ఏవోబీ ప్రాజెక్టు పనులు జరుగుతుండడంతో నిత్యం వందలాది లారీలు అధిక లోడులతో రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. అధిక లోడులతో వెళుతున్న లారీలు దుమ్ము, ధూళి రేపుకుంటూ వస్తున్నాయి. లారీల వెనుక వచ్చే వాహనాలకు రోడ్డు కనిపించని పరిస్థితి ఏర్పడింది. అదే ద్విచక్రవాహనదారులైతే ఆ దుమ్ము, ధూళికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గొంతు, కళ్లు, చర్మ, డస్ట్ అలర్జీ వంటి వ్యాధులకు గురవుతున్నారు. రోడ్డును ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, ధూళి ఇళ్లలోకి వచ్చేస్తుందని, ఇళ్లలోని వస్తువులు, బట్టలు, తాగునీటిపై కూడా దుమ్ము చేరిపోతుందని వాపోతున్నారు. కొత్తరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.15కోట్లు మంజూరు చేయడంతో సంబంధిత అధికారులు మూడు బిట్లుగా రోడ్డు పనులు చేపట్టారు. కొత్తరోడ్డును ఏర్పాటు చేసేందుకు శిథిలమైన పాత రోడ్డును యంత్రాలతో తొలగిస్తున్నారు. పనులు పూర్తి చేసేంతవరకు రోడ్డును ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం నీటితో తడిపించి దుమ్ము,ధూళి ఎగసి పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయకుండా బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన తగదు

- సీపీఎం, వైసీపీ, రైతు సంఘం నేతలు



విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం, వైసీపీ, రైతు సంఘం నేతలు

నక్కపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన నిర్వాసిత రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా ఈనెల 8న ప్రధాని మోదీ బల్క్‌డ్రగ్ పార్కుకు వర్చువల్‌గా ఎలా శంకుస్థాపన చేస్తారని సీపీఎం, వైసీపీ, రైతు సంఘం నాయకులు ప్రశ్నించారు. ఆదివారం రాజయ్యపేటలో నిర్వాసితులతో కలిసి వైసీపీ నేత వీసం రామకృష్ణ, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఎం.అప్పలరాజు విలేకర్లతో మాట్లాడారు. భూములిచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో నిర్వాసిత రైతులకు న్యాయం చేయకుండా రైతుల సాగులో వున్న భూములలో వున్న కొబ్బరి, జీడి,మామిడి తోటలను నేలమట్టం చేయడం అప్రజాస్వామికమన్నారు. కాకినాడ జిల్లాలో ప్రజలు తిరస్కరించిన బల్క్‌డ్రగ్ పార్కును నక్కపల్లి మండలంలో ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ఉనికి దెబ్బతింటుందని, మత్స్యకారులు, చేతివృత్తుల వారు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. కార్యక్రమంలో తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్, ఎం.మహేశ్, వి.సత్యారావు, కె.చిన్న, సోమేశ్వరరావు, కాశీరావు, వై సత్తిబాబు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు హోం మంత్రి పరామర్శ



వినోద్‌రాజును పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు యేజెర్ల వినోద్‌రాజును ఆదివారం రాత్రి హోం మంత్రి వంగలపూడి అనిత పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వినోద్‌రాజుతో మాట్లాడారు. అనంతరం అక్కడున్న వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత సూచించారు. హోం మంత్రితోపాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు కూడా వినోద్‌రాజును పరామర్శించారు.

నేత్రానందంగా సింహాద్రప్పన్న అంబలం పూజ

మునగపాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళావేదిక వద్ద ఆదివారం సింహాద్రప్పన్న అంబలం పూజ నేత్రానందంగా జరిగింది. స్థానిక అప్పన్న మాలధారణ భక్తులు పూజలను చేశారు. సింహాద్రి అప్పన్న భక్తి గీతాలను ఆలపించారు. సంప్రదాయబద్ధంగా అంబలం పూజ నిర్వహించారు.

వైష్ణవాలయంలో ధనుర్మాస భోజనాలు

మునగపాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ వీధిలో ఉన్న పురాతన రామాలయంలో ఆదివారం ధనుర్మాస భోజనాలు ఏర్పాటు చేశారు. గత నెల 16వ తేదీ నుంచి ఆలయంలో ధనుర్మాసం పూజలు జరుగుతున్నాయని, దానిలో భాగంగా భోజనాలు ఏర్పాటు చేశామని సీతారామ ఆలయం అర్చకులు రేజేటి వేంకటరామ వరహా నరసింహాచార్యులు (రాంబాబు), రేజేటి వేంకట సత్యనారాయణాచార్యులు (నాని) తెలిపారు. ఈనెల 10వ తేదీన జరగనున్న ముక్కోటి ఏకాదశి వేడుక నిర్వహణపై ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశం అయ్యిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడారి లక్ష్మణరావు, కిష్టప్ప, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో ఉన్నత స్థాయికి ఎదగవచ్చు

- ఎన్ఆర్ఐ ఆడారి పావని



బాలికలకు ఉపకార వేతనాలందజేస్తున్న మాజీ ఎంపీపీ వెంకట్

మునగపాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ చూపితే ఉన్నత స్థాయికి ఎదగవచ్చునని ఎన్ఆర్ఐ ఆడారి పావని అన్నారు. ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 17 మంది బాలికలు ఉపకార వేతనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు ఏవీఎన్.మూర్తి, అధ్యక్షుడు శిష్టల తమ్మిరాజు, సభ్యులు కేవీ రమణ, నాగేశ్వరరావు, నూకేష్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

406 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఆదివారం నిర్వహించిన 134వ ఉచిత కంటి వైద్యశిబిరంలో వైద్యులు 406 మంది రోగులకు పరీక్షలు జరిపారు. వీరిలో 242 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 144 మందికి మందులు అందజేశారు. మరో 20 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో శస్త్రచికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ ప్రతినిధులు తెలిపారు. శిబిరానికి హాజరైన వారికి పులిహోర,భోజనం అందజేశారు.

వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

మునగపాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి లక్ష్యంగా 1992లో నెలకొల్పిన తిమ్మరాజుపేట గ్రామాభ్యుదయ కమిటీ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించింది. మండలంలో వాడ్రాపల్లిలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో 32 సంవత్సరాల్లో చేసిన కార్యక్రమాలు గురించి మాట్లాడారు. అనంతరం ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనువాసరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రతినిధి బీవీ.లక్ష్మణరావు, డాక్టర్ బీహెచ్.భాస్కర్, ప్రసాద్, శ్రీరామ్మూర్తిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాశంకర్, సూరిశెట్టి రాము, బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ముందుకొచ్చిన ప్రవాస అరబుపాలెం వాసులు



ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

మునగపాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, వ్యాపార రీత్యా పలు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న అరబుపాలెం వాసులు గ్రామాభివృద్ధికి మేము సైతమంటూ ముందుకొచ్చారు. ఆదివారం వారంతా స్వగ్రామం అరబుపాలెం చేరుకొని ముసిలితల్లి ఆలయం వద్ద సమావేశమయ్యారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై చర్చించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. అవసరమైన ఆర్థిక వనరుల గురించి సూచనలు, సలహాలు తీసుకున్నారు. గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేద్దామంటు ఎస్వీఆర్.నాయుడుతోపాటు పలువురు పిలుపునిచ్చారు. ప్రముఖులను సత్కరించారు. డీసీసీబీ వ్యవస్థాపకుడు స్వర్గీయ బొడ్డేడ అచ్చింనాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు



మోడల్ పరీక్షను రాస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట హైస్కూల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ నమూనా టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన భయాన్ని పోగొట్టేందుకు వారి ప్రతిభను వెలికి తీసేందుకు మోడల్ పరీక్షను నిర్వహించామన్నారు. ఈ పరీక్షకు 14 పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ, మండల అధ్యక్ష, కార్యదర్శులు అభి, మణికంత, డివిజన్ నాయకులు రామలక్ష్మణులు, కృప, శ్రీను పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న వేచలపు జనార్దన్

కోటవురట్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములవాక పంచాయతీ శివారు గ్రామాలకు రూ.పది లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి టీడీపీ మండల నాయకులు వేచలపు జనార్దన్, భాస్కరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వేచలపు జనార్దన్ మాట్లాడుతూ..పాములవాక శివారు కన్నూరుపాలెం, భీమిరెడ్డిపాలెం గ్రామాలకు ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సుర్ల రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆటో, మోటారు ట్రాన్స్‌పోర్టు
కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

▸ జిల్లా సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆలిండియా రోడ్డు మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సదస్సులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రోడ్డు ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల జీవనం అత్యంత దుర్భరంగా తయారైందని వాపోయారు. డీజిల్ ధర పెంపు వల్ల రవాణా రంగ కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం అమలు చేసి, సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగం ద్వారానే 2021-22లో ప్రభుత్వాలకు రూ.ఐదు లక్షల కోట్లు సమకూరిందని, దీనిలో ఆరు శాతాన్ని కేటాయించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం, రూ.30 వేల కోట్లు పెట్టి సంక్షేమ బోర్డును ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. అలాగే లైసెన్సు, ఫిట్‌నెస్ తదితర సౌకర్యాలు ప్రైవేటుకు ధారాదత్తం చేసి మరింత భారాలు వేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. పీటీడీ అద్దె బస్సులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల నాయకుడు వి.తులసీరామ్ మాట్లాడుతూ పీటీడీలో పనిచేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లకు చాలా తక్కువ జీతాలు ఇచ్చి ఇటు ప్రభుత్వం, అటు యజమానులు దోపిడీకి గురిచేస్తున్నాయని వాపోయారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి పీఎస్‌వీ పరమేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఎస్‌ఏవోటీ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్‌గా జి.దేముడునాయుడు ఎన్నికయ్యారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా దేముడునాయుడు ఎన్నిక కాగా, 12 మందితో కమిటీ ఏర్పాటు చేసినట్టు నాయకులు తెలిపారు.

'తుమ్మపాల షుగర్స్‌పై కొణతాల ప్రకటన సరికాదు'



సమావేశంలో పాల్గొన్న వీవీ రమణ షుగర్స్ పరిరక్షణ సమితి ప్రతినిధులు

తుమ్మపాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీపై ఈ నెల ఒకటో తేదీన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేసిన ప్రకటనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని వీవీ రమణ షుగర్స్ పరిరక్షణ సమితి ప్రతినిధులు విల్లూరి పైడారావు, కర్రి అప్పారావు, కోరిబిల్లి శంకరరావు, కనిశెట్టి సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో విల్లూరి పైడారావు మాట్లాడుతూ కూటమి అధికారం చేపట్టిన వెంటనే తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. చెరకు ఫ్యాక్టరీని ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తామని ఎమ్మెల్యే కొణతాల ప్రకటన చేయడం రైతుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. 13వేల మంది షేర్ హోల్డర్లు ఉండగా ఎవరి అభిప్రాయాలు సేకరించకుండా ఇలాంటి ప్రకటనలు చేయడం తగదన్నారు. షుగర్ ఫ్యాక్టరీ ఆస్తులను కాజేసేందుకే ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కర్రి అప్పారావు మాట్లాడుతూ గతంలో డిస్టలరీ, మెడిసిన్, ఫినాయిల్ వంటి ఉత్పత్తులతో ఫ్యాక్టరీ విజయవంతంగా నడిచిందన్నారు. ఆ కోణంలో ప్రభుత్వం ఆలోచించకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. తక్షణమే షుగర్ ఫ్యాక్టరీ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించండి : యూటీఎఫ్

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెలలో ఐదో తేదీ గడిచి ఆరో తేదీ వస్తున్నా ఉపాధ్యాయులకు జీతాలందకపోవడం విచారకరమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ఒకటో తేదీనే జీతాలు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జూన్ నెలలో మాత్రమే ఒకటో తేదీన జీతాలు వేసి , తర్వాత నెల నుంచి ఒకటో తేదీన కాకుండా రెండు, మూడు, నాలుగు, ఐదు తేదీల్లో ఆలస్యంగా జీతాలు వేయడం జరుగుతుందని వాపోయారు. ఇలా అయితే తాము కుటుంబాలను ఎలా నెట్టుకురావాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలను చెల్లించాలని ఆయన కోరారు.

అధ్వాన రహదారితో అవస్థలు

▸ గోతుల మయంగా సోమునాయుడుపాలెం- స్వయంభూవరం రోడ్డు ▸ రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు

▸ వర్షాల సమయంలో గెడ్డనీరు పారుతుండడంతో మరిన్ని కష్టాలు ▸ పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు ఆగ్రహం



సోమునాయుడుపాలెం సమీపంలో తేలిన రాళ్లు



పెద స్వయంభూవరం సమీపంలో దెబ్బతిన్న రహదారి

పరవాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రావాడ పంచాయతీ సోమునాయుడుపాలెం నుంచి కలపాక పంచాయతీ మూల స్వయంభూవరం మీదుగా స్వయంభూవరం వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. దారిపొడుగునా పెద్ద పెద్ద గుంతలు పడడంతో పాటు రాళ్లపైకి తేలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారి నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులంతా వాపోతున్నారు. కనీసం గోతులు పూడ్చే పరిస్థితి కూడా లేకపోయిందన్నారు. వర్షాల సమయంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెపుతున్నారు. ఆయా గుంతల్లో నీరు చేరుతుండడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. దీనికి తోడు వర్షపు నీరు సమీపంలో గెడ్డల ద్వారా వచ్చి రహదారి మీదుగా పారడంతో కోతకు గురవుతోంది. అలాగే రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు ఉండడంతో పురుగులు, పాములు రోడ్డుపైకి చేరుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి దుస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని అంటున్నారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ



ఆలయానికి సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నుంకరమెట్ట జంక్షన్‌లో గల సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి దేవస్థానంలో సత్యదేవ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గోదాదేవికి సారె సమర్పించారు. మహిళలు తొలుత తమతమ ఇళ్లలో తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను పళ్లాల్లో పేర్చి, పసుపు కుంకుమ, కొబ్బరియాలు తదితరాలతో గవరపాలెంలోని పురవీధుల గుండా మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ, ఈవో మురళీకృష్ణ, కమల, మారిశెట్టి భాస్కరరావు, పెంటకోట చంద్రరావు, శ్రీకాకుళపు గణపతి, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్, తురకలపూడి హేమ, బుద్ద మురళీ తాతారావు, ఆలయ ప్రధానార్చకులు సాగర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

సబ్బవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం అనకాపల్లి జిల్లా డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. భీమవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్రం అధ్యాపకుడు బి.ప్రసాదరావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా కొత్త అధ్యక్షుడిగా ఎంవీ రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ . సత్యనారాయణ, కార్యదర్శిగా డాక్టర్ బీవీ రమణ, ట్రెజరర్‌గా డాక్టర్ ఎస్.సూర్యావతి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ పైడిరాజు, రాష్ట్ర కౌన్సిలర్‌గా డాక్టర్ రాధాకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన బుద్ద, ప్రగడ



నారా లోకేశ్‌తో బుద్ద నాగజగదీశ్, ప్రగడ నాగేశ్వరరావు

అనకాపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌ను ఆదివారం విశాఖ విమానాశ్రయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ నియోజకవర్గాల్లో పరిస్థితులను ఆయనకు వివరించారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి అంతా పాటుపడాలని లోకేశ్ దిశానిర్దేశం చేసినట్టు నాయకులు బుద్ద, ప్రగడలు ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇదిలావుంటే, ఇదిలావుంటే, టీడీపీ అనుబంధ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలను మంత్రి లోకేశ్ ఎయిర్‌పోర్టులో ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాతలక్ష్మి, కోట సతీష్, జిల్లా గౌరవాధ్యక్షుడు కోట్ని రాంబాబు, నూకేష్ పాల్గొన్నారు.

కథా రచయిత, కార్టునిస్టు భువన్ ఇక లేరు



అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ కవి, కథారచయిత, కార్టునిస్టు, సాహితీవేత్త మళ్ల వెంకట జగన్నాథ భువనేశ్వరరావు (భువన్) అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశారు. 1966 నవంబరు 23న అనకాపల్లిలో జన్మించిన ఈయనకు బాల్యం నుంచే సాహిత్యం, చిత్రకళ పట్ల మక్కువ ఎక్కువ. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఎన్నెన్నో కార్టూన్, కథల పోటీలు, సాహితీ సమావేశాలు నిర్వహించి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, మిత్రులు సంతాపం తెలిపారు.

ఘనంగా సెయింట్ జాన్స్ స్కూల్ వార్షికోత్సవం



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కశింకోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సెయింట్ జాన్స్ స్కూల్ 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో జి.అప్పారావునాయుడు హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ పేటరన్ జాన్ యతిరాజు, స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబుల్‌కుమార్, చైర్‌పర్సన్ బత్తుల అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

83 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు జరుపుతున్న వైద్య నిపుణులు

సబ్బవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుల్లేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అక్షర పబ్లిక్ స్కూల్లో ప్రిన్సిపాల్ బి.అప్పారావు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ బండారు మంగ ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి 83 మంది కంటి రోగులు రాగా, వీరికి శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం పరీక్షలు జరిపారు. వీరిలో పదిహేడు మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.





మోగిన శంఖం



కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు













సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



'కుల గణన ద్వారానే బీసీలకు న్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

తుమ్మపాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీసీ కుల గణన ద్వారానే ఆ వర్గాలకు న్యాయం జరుగుతుందని బీసీ కులాల సమన్వయ కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణ చంద్రరావు అన్నారు. ఆదివారం ఇక్కడి సీపీఐ కార్యాలయంలో బీసీ కులాల ప్రతినిధుల సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీ కులాలు వెనుకబడి ఉన్నాయన్నారు. బీసీలు తమ హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీల బలం తెలియాలంటే దేశవ్యాప్తంగా ఉన్న బీసీ కుల గణన జరగాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ప్రతినిధులు కరణం తిరుపతిరావు, ఆర్‌సీ రమణ, కె.శ్రీనివాసయాదవ్, గుడాల సత్యనారాయణ, బొట్టా చిన్నియాదవ్, కోన లక్ష్మణ, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల కోలాహలం



అనకాపల్లి జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1952 నుంచి ఇక్కడ చదువుకున్న వారంతా కలవడంతో కోలాహల వాతావరణం నెలకొంది. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. లీడర్ పత్రిక సంపాదకులు వీవీ రమణమూర్తి మాట్లాడుతూ ఏటా పూర్వ విద్యార్థుల సమావేశం జనవరిలో ఏర్పాటు చేసుకోవడంతో పాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిద్దామన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సాయంత్రం వరకు సరదాగా గడిపారు. నిర్వాహకులు పీఎస్ అప్పారావు, దాడి శివరామకృష్ణ, కేఎస్‌వీ సత్యనారాయణ, బల్లా నాగభూషణం, బొడ్డేడ అప్పారావు, విల్లూరి అప్పల స్వామినాయుడు, శరగడం శ్రీరామచంద్రమూర్తి, బుద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...



సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్‌లో...

సబ్బవరం : ఇక్కడి ప్రభుత్వ హైస్కూల్‌లో 1990-91 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా ఆదివారం కలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నర్సింహమూర్తి, జంగమయ్య, సింహప్రసాద్, చినసూర్యనారాయణ, సరస్వతిలను సత్కరించారు. భోజనాల అనంతరం సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థి నారపాడు కృష్ణ యాభై కుర్చీలను వితరణగా అందజేశారు. పూర్వ విద్యార్థులు కె.విశ్వనాథ్, ఇ.అప్పారావు, కె.వసంత్, సీహెచ్.శ్రీను, ఎల్.చిన్నారావు, జి.ముత్యాల నాయుడు, టీఏ లింకన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కమ్మరితోటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నడిగట్ల రాజు

సీలేరు, జనవరి 5 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామానికి మంజూరైన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ నడిగట్ల రాజు ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 2 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ మంజూరు నిధులు మంజూరు చేసిందన్నారు. నాణ్యతా లోపం లేకుండా పనులు నిర్వహించాలని ఈ సందర్భంగా సర్పంచ్ కాం ట్రాక్టర్ ప్రసాద్‌ను సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, వార్డు సభ్యులు కిల్లో అంజనేయులు పాల్గొన్నారు.5ఎస్ఎల్ఆర్1:కమ్మరితోటలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నడిగట్ల రాజు.

రిటైర్డ్ డీఎంహెచ్‌వోకి సన్మానం



రిటైర్డ్ డీఎంహెచ్‌వో మహేశ్వరరావుని సన్మానిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన పశ్చిమగోదావరి జిల్లా డీఎంహెచ్‌వో డి. మహేశ్వరరావుని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండలంలోని లంబసింగి పంచాయతీ లబ్బంగి గ్రామానికి చెందిన మహేశ్వరరావు గిరిజన ప్రాంతంలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారి, చింతపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా సేవలందించారు. రెండేళ్లగా పశ్చిమగోదావరి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్నరు. ఏడేళ్ల సర్వీసు ఉంది. అయితే, వ్యక్తిగత కారణాలతో గత నెల 31న స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో దంపతులకు ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యసిబ్బంది అనిల్‌బాబు, గౌరీశంకర్, సోమేశ్‌కుమార్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు



నిందితులతో పోలీసులు

హుక్కుంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ఒడిశాలోని కలహండి జిల్లా బల్దియామాల్ గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ ఎల్.సురేశ్ తెలిపారు. శనివారం ఏపీఎస్పీ పార్టీతో కలిసి తమ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒడిశాలోని జయంతి గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న చంద్రసేన్‌మెహర్, జయదేవ్ మెహెర్‌లను మండలంలోని పామ్రాయ్ ట్టుకున్నామన్నారు. వారినుంచి 16 కిలోల గంజాయి, బైక్‌ని సీజ్‌చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. వీరు కలహండి జిల్లా అండిగల్ గ్రామంలో ఉన్న ఒక వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి హుక్కుంపేట సంతలో ఆటోడ్రైవర్లకు సరఫరా చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

అత్తమామల వేధింపులతో ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు తాగి అస్వస్థతకు లోనైన అనిల్

సీలేరు, జనవరి 5 , (ఆంధ్రజ్యోతితి): అత్తమామల వేధింపుల తాళలేక జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి కమ్మరితోట గ్రామానికి చెందిన కిముడు అనిల్ (25) ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పురుగుల మందు తాగి అస్వస్థతకు గురైన ఆయనను గ్రామస్థులు హుటాహుటీన ధారకొండ పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి డీకే హిమబిందు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన వైద్య సేవలకు చింతపల్లి ఆసుపత్రికి తరలించారు.

ముగిసిన జిల్లా స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన

▸ రాష్ట్ర స్థాయికి ఆరుగురి నమూనాలు ఎంపిక



విజేతలకు ప్రశంస పత్రాలను అందిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు, అధికారులు

పాడేరురూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పాడేరులో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనపరిచిన ఆరు గురు విద్యార్థుల నమూనాలు రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేసినట్టు జిల్లా సైన్స్ అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల తలారిసింగిలో నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ ప్రదర్శనలో 120 పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల గ్రూపులు పాల్గొన్నారన్నారు. టీచర్స్ విభాగంలో డార్క్ ఆక్సిజన్ కాన్సెప్ట్‌లో చండా బాలకృష్ణ ప్రథమ, ఎంవీ నాయుడు ద్వితీయ బహుమతులను కైవసం చే సుకున్నట్టు నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థుల విభాగంలో పెదబయలుకు చెందిన పి.అవినాష్ మమతల ఊయల ఆర్బిఫిషియల్ కేర్‌టేకర్ ప్రథమ , ముంచంగిపుట్టుకు చెందిన కె.శ్రావణి సేవ్ ఎర్త్ ప్రాజెక్టుకు ద్వితీయ బహుమతులు గెలుపొందినట్టు చెప్పారు. విద్యార్థుల గ్రూప్‌లో పెదబయలుకు చెందిన పి. తేజశ్వి, కె.మీనాక్షి, పేటెంట్ సేఫ్టీ అలెర్ట్ ప్రాజెక్టులో ప్రథమ స్థానం, గుత్తులపుట్టు పాఠశాలకు చెందిన బి.నాగ శరణ్య, జె.కాత్యాయని రూపొందించిన యాంటియాక్సిడెంట్ సెన్సార్ గర్ల్స్ ప్రాజెక్టులు ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈ నెల 7, 8వ తేదీలలో విజయవాడలో జరిగే రాష్టస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. విజేతలకు డీఈవో పి.బ్రహ్మాజీరావు బహుమతులను అందించారన్నారు. డీఎస్‌వో నాగేశ్వరరావు, జిల్లా కో-ఆర్డినేటర్ పి.రమణమూర్తి, అకాడమీ జిల్లా కో-ఆర్డినేటర్ కేజే రామారావు, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, హెచ్‌ఎం సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రయోజకులై జీవితంలో స్థిరపడితే ఉపాధ్యాయులకు నిజమైన ఆనందం కలుగుతుందని స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-1 పీజీ హెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్ అన్నారు. ఆదివారం పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 2001-02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన ఈ పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్థానిక పాఠశాల పీజీహెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్, విద్యాబోధన చేసిన సీనియర్ ఉపాధ్యాయులు తగ్గి త్రీమూర్తులను ఘనంగా ఈ సందర్భంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామరాజ్ పడాల్‌మాట్లాడుతూ విద్యాబోధన చేసిన గురువులను గౌరవించడం అభినందనీయమన్నారు.

మోదకొండమ్మ ఆలయంలో రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాడేరురూరల్, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, పాడేరు మోదకొండమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన్యంలోని వివిధ ప్రాంతాల్లోని వారితోపాటు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మన్యంలోపర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు వచ్చిన వారు అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు ఆధ్వర్యంలో భక్తులకు ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ప్రసాద కమిటీ ప్రతినిధులు బి.వెంకటరమణ, సీహెచ్.రామకృష్ణ, దన్నేటిపలాసి రాము, జి. శంకరరావు, టి.ఈశ్వరరావు, కె.వెంకటరమణ, కె.చంద్రమోహన్‌కుమార్, కె.దేముడు, కె.రాధాకృష్ణం నాయుడు తదితరులు పాల్గొన్నారు. పాడేరు ఘాట్ మార్గంలోని మోదాపల్లి జంక్షన్ వద్దగల అమ్మవారి పాదాలకు మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

హెల్మెట్ ధరించకుంటే కేసులు నమోదు: ఎస్ఐ



వాహన తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

అనంతగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేకుండా వాహనాలునడిపితే కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్ఐ డి .శ్రీ ని వా స రావు హెచ్చరించారు. మండలంలోని డముకు వ్యూపాయింట్ వద్ద ఆదివారం ఉదయం నుంచి వాహన తనిఖీలు చేపట్టారు.. హెల్మెట్, లైసెన్స్, వాహన రికార్డులు, నిబంధనలు పాటించని వాహనచోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ అమిత్‌బర్ధర్, అరకు సీఐ హిమగిరి ఆదేశాలపైఘాట్‌రోడ్డు ప్రయాణంపై పర్యాటకులు, వాహనచోదలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మలుపుల వద్ద జాగ్రత్తగా నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్ డొంబు, తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాన



అజోల్లా పెంపకంపై శిక్షణ ఇస్తున్న సీనియర్ శాస్త్రవేత్త బాల హుస్సేన్‌రెడ్డి

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల తయారీపై యువ రైతులు, విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ రెడ్డి అన్నారు. ఆదివారం పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయం కోర్సులో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ సేంద్రియ సాగులో పంటకు ద్రవ జీవామృతం, ఘనజీవామృతం, వర్మీకంపోస్టు, నాడెప్ కంపోస్టు, అజోల్లా తరహా ఎరువులను అందించాలన్నారు. అజోల్లాలో అత్యధిక పోషక విలువలు ఉంటాయని, దీన్ని రైతులు తొట్టెల్లో పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ రిసోర్స్ పర్సన్ రాజాబాబు, టీచింగ్ అసోసియేట్ బాబుజినాయుడు పాల్గొన్నారు.

15 చోట్ల పెసా ఎన్నికలు ఏకగ్రీవం



దొడ్డిపల్లిలో చేతులు ఎత్తి సభ్యులను ఎన్నుకుంటున్న ప్రజలు

పాడేరురూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మూడో రోజు నిర్వహించిన పెసా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు తెలిపారు. 19 చోట్ల పెసా కమిటీ ఎంపికలు జరగాల్సి ఉండగా 15 చోట్ల ఏకగ్రీవంగా పూర్తయినట్టు చెప్పారు. దొడ్డిపల్లి గ్రామంలో పోటీ పడటంతో ఓటింగ్ నిర్వహించామన్నారు. గురుపల్లి, దొడ్డిపల్లి, బర్సింగి, గడివలస, వనుగుపల్లి, తామరాపల్లి, జీడిపగడ, కించూరు, బంట్రోతుపుట్టు, తొటలగొంది, ఇరడాపల్లి, సలుగు, లోలంగిపాడు, కక్కి, డల్లాపల్లి, వంచడిగొందిలో ఏకగ్రీవం కాగా, దొడ్డిపల్లిలో కంబిడి పంతులు బాబు ఉపాధ్యక్షుడిగా, కూడా వెంకటేష్, కార్యదర్శిగా ఎంపికయ్యారన్నారు. సేరుబయలు, ఇ. కొత్తూరు, వై.సొలములులో కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు.

గూడెంకొత్తవీధి: మండలంలో ఆదివారం 13 గ్రామ సభల్లో పెసా ఎన్నికలు నిర్వహించినట్టు ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. 16 పంచాయతీల పరిధిలోనున్న 352 గ్రామాలకు సంబంధించి 74 గ్రామ సభలు ఉన్నాయన్నారు. శుక్ర, శనివారాలు 61గ్రామ సభలకు ఎన్నికలు జరిగాయన్నారు. మిగిలిన 13 గ్రామ సభల్లో ఉపాధ్యక్షుడు, కార్యదర్శి ఎన్నికలు పూర్తి చేశామన్నారు.



జీకేవీధి పెసా ఉపాధ్యక్షుడు వీరవెంకట్‌కి ధ్రువ పత్రమిస్తున్న అధికారి

జీకేవీధిలో కూటమి, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ

జీకేవీధి పెసా కమిటీ కార్యదర్శి ఎన్నిక సమయంలో కూటమి, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. పార్టీలకు అతీతంగా నిర్వహించాల్సిన ఈ ఎన్నికల్లో కూటమి మద్దతుదారులను బలవంతంగా వైసీపీలో చేర్చారంటూ ఘర్షణ పడ్డారు. దీంతో పోలీసులు జోక్యంతో సద్దుమనిగింది. చివరికి ఉపాధ్యక్షుడిగా గొర్లె వీరవెంకట్, కార్యదర్శిగా ముక్కలి రవి ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి ఊలం చిన్నయ్యపడాల్ ప్రకటించి ధ్రువపత్రాలు అందజేశారు.

పెదబయలు: మండల పరిధిలో ఆదివారం 35 చోట్ల పెసా కమిటీ ఎన్నికలు నిర్వహించినట్టు స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య, ఎన్నికల ప్రత్యేక అధికారి రవికుమార్ తెలిపారు. గంపరాయి పంచాయతీ కుశ్శభ, లక్ష్మీపేట పంచాయతీలో పూటూరు, గోమంగి పంచాయతీ పరిధి బోయరాజుల గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించినట్టు చెప్పారు. ఎక్కడా అ వాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరిగినట్టు చెప్పారు.

సీకరిలో 12 నుంచి క్రికెట్ టోర్నమెంట్

పెదబయలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీకరి పంచాయతీ కేంద్రంలో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరగనున్న గంగా దేవత పండుగ సందరంగా డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 12వ తేది నుంచి నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సీకరి వెంకట ప్రసాద్, తెలిపారు. పాడేరు, అరకు నియోజకవర్గాలకు చెందిన క్రీడాకారులు ఈ నెల 9వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి జట్లు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం ఫోన్: 9391751719 (దొర), 7780328030 (బాలకృష్ణ) సం ప్రదించాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన జీసీసీ చైర్మన్ 'కిడారి'



మంత్రి నారా లోకేశ్‌ను పలుకరిస్తున్న చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్‌ను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆదివారం విశాఖపట్నంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీసీసీ ఉత్పత్తులను ఆయనకు బహుమతిగా అందించారు. అలాగే గిరిజన ప్రాంత అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేయాలని నారా లోకేశ్‌ను శ్రావణ్ కుమార్ కోరారు.

మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న బీపీఎంసీఈఎఫ్ ప్రతినిధులు

ముంచంగిపుట్టు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని బ్యాక్‌వర్డ్ యండ్ మైనార్టీ కమ్యూనిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (బీపీఎంసీఈఎఫ్ ఎస్సీ ఎస్టీ బీసీ) మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముందుగా సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. ఆ మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీపీఎంసీఈఎఫ్ ప్రతినిధులు ఆర్.చంద్రశేఖర్, కోటిబాబు, కృష్ణారావు, రామకృష్ణ కామేశ్వరరావు, కామేశ్, చిట్టిదొర, రాజుబాబు, సూర్యనారాయణ, సురేష్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదాయ, చార్జీలపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ



ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

పాడేరురూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థికసంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీఈపీడీసీఎల్ జిల్లా ఎస్ఈ కార్యాలయంలో ఈ నెల 7, 8, 10వ తేదీలలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరపనున్నట్టు ఎస్ఈ జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. కొత్తపాడేరులోని తన కార్యాలయంలో మూడు రోజులు హైబ్రిడ్ విధానంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణను ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వర కు ప్రత్యక్షంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి అన్ని డిస్కమ్‌ల టారీఫ్, ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలను వింటారన్నారు. ఇందులో వినియోగదారులు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ మేరకు విద్యుత్ కార్యాలయాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఫ్చ్... చలీ!

▸ కనిష్ఠ ఉష్ణోగ్రతలతో వణుకుతున్న మన్యం



సీలేరులో ఉదయం ఎనిమిది గంటలకు కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు/ సీలేరు/ పాడేరు రూరల్ : ముంచంగిపుట్టు ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంత ప్రజలను చలి గజగజలాడిస్తోంది. ఆదివారం ఉష్ణోగ్రతలు దిగజారడంతో ఉదయం పది గంట లు వరకు మంచుతెరలు వీడలేదు. పట్టపగలు లైట్ల వెలుగులో వాహన రాకపోకలు జరిగాయి. చలి గాలు వీస్తుండడంతో ఇళ్లనుంచి బయటకు వచ్చేందుకు ఎవరు సాహసించడంలేదు. సాయంత్రం నాలుగు దాటితే చాలు స్థానిక ప్రధాన రహదారిపై జనసంచారం తగ్గిపోతోంది. అలాగే ఎక్కడ పడితే అక్కడ చలిమంటలు దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీలో జీకేవీధి మండలం సీలేరులో వణికిస్తోంది. సీలేరులో ఆదివారం కనిష్ఠంగా 11 డిగ్రీల ఉష్ణోగ్రలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా పాడేరులో చలితీవ్రత అధికంగా ఉండటంతో పట్టణ ప్రజలు సాయంత్రం అయితే బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ఉదయం 10 గంటల వరకు మంచుతీవ్రత అధికంగా ఉండటంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇంబ్బంది పడుతున్నారు.

చోడవరంలో రైతు బజార్

... 5వ పేజీ తరువాయి

రైతులకు, చిరువ్యాపారులకు దుకాణాలు కేటాయిస్తామన్నారు. దీనిని మోడల్ రైతు బజారుగా తీర్చిదిద్దుతామన్నారు. పట్టణంలో పంచాయతీ దుకాణాల పైభాగంలో కూడా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే ఆలోచన ఉందని తెలిపారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, పప్పు శ్రీనివాసరావు, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభ చిరస్మరణీయంగా నిలవాలి

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని మొదటిసారిగా రాష్ట్రానికి వస్తున్నారని, ఈ సందర్భంగా మూడు పార్టీల నేతలు, ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గతంలో విజయవాడలో నిర్వహించిన సభను మించి యావత్‌దేశం మనవైపు చూసేలా విశాఖ సభ నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభకు కనీసం మూడు లక్షల మంది హాజరయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అధిక నిధులు కేటాయిస్తోందని, అభివృద్ధి ప్రాజెక్టులు చేపడుతోందని, మోదీ సభను విజయవంతం చేయడం ద్వారా దానికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. రోడ్‌షో ద్వారా ప్రధాని ప్రజలను పలుకరించనున్నారని, ప్రజలంతా ప్రధాని కాన్వాయ్‌కి చేరువగా ఉండేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సింగిల్ బారికేడింగ్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బందిలేకుండా రోడ్‌షో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

నేతలకు బాధ్యతల అప్పగింత

ప్రధాని మోదీ వెంకట్రాది వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో సభా వేదిక వరకు రోడ్‌షో నిర్వహిస్తారని, అయనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొంటారన్నారు. రోడ్‌షో బాధ్యతలను విప్ గణబాబుకు, బహిరంగ సభ నిర్వహణ బాధ్యతలను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అప్పగించారు. మిగిలిన నేతలంతా వారికి సహకరించాలన్నారు. ప్రధాని సభ చారిత్రాత్మకమని, ఈ మూడు రోజులు ప్రజా ప్రతినిధులు, అధికారులు సింగిల్ అజెండాగా పనిచేయాలని నిర్దేశించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, సీపీ శంకబ్రాత బాగ్చీ మంత్రికి వివరించారు. అన్ని రకాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. వీవీఐపీ, వీఐపీ వాహనాలు, సభకు తరలివచ్చే ప్రజల వాహనాలకు 26 చోట్ల పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. పాసుల జారీకి సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సమీక్ష సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

మినుము పంటపై తెగుళ్ల దాడి

... 5వ పేజీ తరువాయి

పూత రాలిపోతున్నదని ఆందోళన చెందుతున్నారు. కాగా మినుము పంటను సోకిన తెగుళ్ల నివారణ గురించి కోమళ్లపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్‌ను సంప్రదించగా.. విత్తన శుద్ధి చేయకపోవడం వల్ల తెగుళ్ల ఆశిస్తున్నట్టు చెప్పారు. పొగాకు లద్దెపురుగు ఆశించిన, పల్లాకు తెగులు సోకిన మొక్కలను పీకివేసి, దూరంగా తీసుకెళ్లి దహనం చేయాలని సూచించారు. అనంతరం పొగాకు లద్దె పురుగు నివారణకు క్లోరీపైరిపాస్ లేదా మోనోక్రోటోపాస్ మందును లీటరు నీటికి 1.6 ఎం.ఎల్. చొప్పున కలిపి ఆకులన్నీ తడిసేలా పిచికారీ చేయాలన్నారు. అలాగే ఐదు కిలోల తవుడులో అర కిలో బెల్లం, అర లీటర్ మోనోక్రోటోపాస్ మందు కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి తెగులు ఉన్న ప్రదేశాల్లో వేయాలని, పొగాకు లద్దె పురుగులు వీటిని తిని చనిపోతాయన్నారు. పల్లాకు తెగులు తెల్లదోమ వల్ల వస్తుందని, పొలంలో ముందుగా ఈ మొక్కలు పీకివేసి అనంతరం థయోమిథోయేట్ మందు లీటర్ నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

తారుమారు సంతకు ఏర్పాట్లు



సంత ఏరాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్

జి.మాడుగుల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో జరిగే తారుమారు (కొత్త) సంతకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని స్థానిక సర్పంచి కిముడు రాంబాబు కోరారు. మంగళవారం దివంగత వెంకటరాజు ఘాట్ వద్ద జరిగే వారపు సంత ఏర్పాట్లను సర్పంచి పరిశీలించారు. ఏటా సంక్రాంతి ముందు జరిగే వారపు సంతకు పండగ సంత, తారుమారు సంతగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది ఈ ఏర్పాట్ల పరిశీలనతో ఎంపీటీసీ సభ్యుడు జి.సన్యాసిదొర, సంత నిర్వహకులు పాల్గొన్నారు.

గిరిజనులకు రగ్గులు, స్వెట్టర్లు పంపిణీ

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నిరుపేద గిరిజనులకు సహాయం చేసేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకురావాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగెడ్డ గ్రామంలో భరోసా లవ్ ఫర్ హ్యూమానిటీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ అవినాశ్ జడ్పీటీసీ చేతుల మీదుగా గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు రగ్గులు, స్వెటర్లు పంపిణీ చేయడం అభినందించదగిన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి బల్లా శ్రీనివాసరావు, సలహాదారులు కమల్ కుమార్, నాగేంద్రబాబు, మాజీ వైస్ఎంపీపీ బూసరి కృష్ణారావు, గ్రామపెద్దలు కవడం ఈశ్వరరావు,అప్పారావు నరేశ్‌పాల్గొన్నారు.

నేడు, రేపు ఇంటర్న్‌షిప్‌లో ప్రవేశాలు

చింతపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 6, 7తేదీల్లో ఇంటర్న్‌షిప్ ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాకర్ ఎం. విజయ భారతి అన్నారు. తృతీయ సంవత్సరం విద్యార్థుల వృత్తినైపుణ్యం పెంపొందించేందుకు ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్‌కి పంపిస్తామన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సిటీ ఇండస్ట్రీస్ కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం పరిధిలో సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. కోనాం జలాశయం వద్ద కోనాం ప్రాజెక్టు కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కోనాం జలాశయంలో సమస్యల పరిష్కారానికి రూ.కోటి మంజూరు చేయించానన్నారు. కాలువలు, చెరువుల్లో సమస్యలను జలాశయం కమిటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు పరిష్కరించాలన్నారు. ముఖ్యమైన సమస్యలను గుర్తిస్తే నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జలాశయం చైర్మన్ పోతల చిన్నంనాయుడు, వైస్ చైర్మన్ కొట్యాడ చిన్నం నాయుడు, డైరెక్టర్లను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు, మాజీ ఎంపీపీలు పోతల రమణమ్మ, కుచ్చు కళావతి, మాజీ సర్పంచ్ చలుగు అప్పలనాయుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో చిత్రకారుడు బొడ్డేడ సూర్యనారాయణ

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. నెల్లూరు అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 3న నిర్వహించిన పోటీల్లో మాడుగులకు చెందిన పుట్టా రోహిత్, చోడవరానికి చెందిన కె.భార్గవ్, కె.అఖిల్, కె.చైతన్య, మోక్షిత్, అఖిల్, టి.భార్గవ్, జి.వర్ధని, సిహెచ్.ప్రవల్లిక వివిధ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. వీరు కాక ఈ పోటీల్లో పాల్గొన్న మరికొందరు విద్యార్థులకు పార్టిసిపేషన్ బహుమతులు లభించాయి. విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంపై స్థానిక చిత్రకళా నిలయం వ్యవస్థాపకులు బొడ్డేటి సూర్యనారాయణను నిర్వాహకులు అభినందించి సత్కరించారు. అలాగే పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్డింజి అతిథిగృహం ఆవరణలో ఆదివారం సీడీపీఎం కమ్యూనిటీ, సద్భావ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన జీవధార రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. శిబిరంలో వివిధ రంగాలకు చెందిన పలువురు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. విశాఖ, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులతో పాటు ఎన్టీఆర్ విశాఖపట్నం బ్లడ్ బ్యాంకులు ఈ శిబిరంలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీవిప్ కరణం ధర్మశ్రీ, శిబిరం నిర్వాహకుడు కొప్పాక రాజేశ్, స్థానిక ప్రముఖులు కాండ్రేగుల డేవిడ్, గూనూరు మూలినాయుడుతో పాటు పలువురు సేవకులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 350 మంది రక్తదానం చేశారు.

ఆటో, మోటారు ట్రాన్స్‌పోర్టు

కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

▸ జిల్లా సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆటో, మోటారు ట్రాన్స్‌పోర్టు కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆలిండియా రోడ్డు మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సదస్సులో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రోడ్డు ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల జీవనం అత్యంత దుర్భరంగా తయారైందని వాపోయారు. డీజిల్ ధర పెంపు వల్ల రవాణా రంగ కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం అమలు చేసి, సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగం ద్వారానే 2021-22లో ప్రభుత్వాలకు రూ.ఐదు లక్షల కోట్లు సమకూరిందని, దీనిలో ఆరు శాతాన్ని కేటాయించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం, రూ.30 వేల కోట్లు పెట్టి సంక్షేమ బోర్డును ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. అలాగే లైసెన్సు, ఫిట్‌నెస్ తదితర సౌకర్యాలు ప్రైవేటుకు ధారాదత్తం చేసి మరింత భారాలు వేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. పీటీడీ అద్దె బస్సులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికుల నాయకుడు వి.తులసీరామ్ మాట్లాడుతూ పీటీడీలో పనిచేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లకు చాలా తక్కువ జీతాలు ఇచ్చి ఇటు ప్రభుత్వం, అటు యజమానులు దోపిడీకి గురిచేస్తున్నాయని వాపోయారు. వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి పీఎన్‌వీ పరమేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఎస్‌ఏవోటీ మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.దేముడునాయుడు పాల్గొన్నారు.

కథా రచయిత, కార్టునిస్టు భువన్ ఇక లేరు


భువనేశ్వరరావు (ఫైల్)

అనకాపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, కథా రచయిత, కార్టునిస్టు, సాహితీవేత్త మళ్ల వెంకట జగన్నాథ భువనేశ్వరరావు (భువన్) అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశారు. 1966 నవంబరు 23న అనకాపల్లిలో జన్మించిన ఈయనకు బాల్యం నుంచే సాహిత్యం, చిత్రకళ పట్ల మక్కువ ఎక్కువ. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఎన్నెన్నో కార్టూన్, కథల పోటీలు, సాహితీ సమావేశాలు నిర్వహించి ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు నాయకులు, ఆయనతో చదువుకున్న మిత్రులు సంతాపం తెలిపారు.

బాలికల వసతిగృహం ప్రహరీ గోడ పునర్నిర్మాణం

- మూడేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- బిక్కుబిక్కుమని కాలం వెల్లదీసిన విద్యార్థులు
- ఎట్టకేలకు స్పందించిన కూటమి ప్రభుత్వం
- రూ.2.6 లక్షలతో చురుగ్గా పనులు


ధ్వంసమైన బాలికల వసతిగృహం ప్రహరీ గోడ (ఫైల్ ఫొటో)... మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

రావికమతం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రావికమతం ఎస్సీ బాలికల వసతి గృహ ప్రహరీ గోడకు ఎట్టకేలకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. మూడేళ్ల క్రితం తుఫాన్‌కు ఈ గోడ కూలిపోయి గేట్లు ధ్వంసమయ్యాయి. అప్పటి ప్రభుత్వం దీన్ని గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం రూ.2.6 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

ఈ వసతి గృహంలో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 150 మంది బాలికలు చదువుకుంటున్నారు. మెయిన్ రోడ్డులో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆనుకుని ఉన్న ఈ వసతిగృహం ప్రహరీ గోడ ధ్వంసమై మూడేళ్లయినా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఏ క్షణంలో వసతిగృహంలోకి ఎవరు ప్రవేశిస్తారో తెలియక రాత్రి వేళల్లో చిన్నారులు భయభ్రాంతులకు గురయ్యేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వసతిగృహ సమస్యలపై దృష్టిసారించింది. ఈ మేరకు ప్రహరీ గోడ మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికపై నిరసన

కృష్ణాదేవిపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా చందక గౌరినాయుడును ఏకగ్రీవంగా నియమించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఆదివారం గొలుగొండ మండలం కొంగసింగి గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎవరికీ తెలియకుండా గౌరినాయుడును నియమించారని, కనీసం సీనియర్ నేతలకు కూడా సమాచారం ఇవ్వలేదని వారు మండిపడ్డారు. ఈ నియామకం రద్దు చేయాలని, లేనిపక్షంలో మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భగా సీనియర్ నేత దంట్ల బాబ్జి మాట్లాడుతూ అధ్యక్ష పదవికి తాను పోటీ చేశానని, 11 ఏళ్లుగా పనిచేస్తున్న తన అభిప్రాయం లేకుండా పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అల్లు నూకరాజు, పైల సత్యరాంప్రసాద్, కొర్రాయి శ్రీను, చిరంజీవి, రమణ, రామారావు, సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


కొంగసింగిలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

'బీజేపీ నాతవరం అధ్యక్ష ఎన్నికలో అవకతవకలు'

నాతవరం: బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆ పార్టీ నేత చుక్కల రాంబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడ్ని బూత్ కమిటీ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉండగా, అనకాపల్లి నుంచి వచ్చిన వ్యక్తి ఎన్నుకోవడమేమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగని ఈ ఎన్నిక చెల్లదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

'బహుజనులపై ఆగని దాడులు'

నర్సీపట్నం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా బహుజనులపై దాడులు ఆగడం లేదని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ విమర్శించారు. గత ఏడాది నవంబరు 15న కొత్తవీధిలో సర్వసిద్ధి నాగేశ్వరరావు హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీనికి నిరసనగా స్థానిక సీటీ క్లబ్ ఆవరణలో ఆదివారం బహుజన రక్షణ పోరాట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే నర్సీపట్నం, అనకాపల్లి యాదవ సంఘాలు రూ.80 వేలు, రూ.70 చొప్పున రూ.1.5 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. పిల్లల చదువుకు అయ్యే ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బహుజనులపై దాడులు జరిగినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం మారినా హత్యలు, దాడులు ఆగలేదని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడే పార్టీలు అధికారంలో ఉండాలన్నారు. బీసీవై పార్టీ అధికారంలోకి వస్తే బీసీల గౌరవాన్ని కాపాడతామన్నారు. ఒమ్మి నరసింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులుపిల్లా వెంకటేశ్వరరావు, ఎలమంచిలి రమణ, ఒమ్మి మహేశ్, ఒమ్మి నూకరాజు, నమ్మి అప్పలరాజు, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

8 నుంచి వాలీబాల్, క్రికెట్ టోర్నీ

నాతవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని నాతవరంలో ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ప్రవాసాంధ్రులు కేఎస్ఆర్ టీమ్ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు టీడీపీ సీనియర్ నేత శెట్టి నానాజీ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ నాతవరం ఫారెస్టు గ్రౌండ్‌లోను, వాలీబాల్, కబడ్డీ పోటీలను నాతవరం హైస్కూల్‌లోను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. క్రీడకారులు రూ.300 ప్రవేశ ఫీజు చెల్లించి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీల్లో మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేల నగదు, షీల్డు అందించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9347433345, 8309158788 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మండల సమావేశం రేపు

రోలుగుంట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

చీడికాడ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి ఏడీఆర్ సిహెచ్.ముకుందరావు చెప్పారు. ఖండివరం గ్రామంలో ఆదివారం శ్రీకాకుళం వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ముకుందరావు ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోస మాట్లాడుతూ వ్యవసాయంలో సాగు విధానాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ పంటల్లో మెరుగైన యాజమాన్య పద్ధతులు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో విస్తరణ విభాగం శాస్త్రవేత్త కిశోర్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.సత్తిబాబు, డాక్టర్ ఎ.సౌజన్య, డాకటర్ బి.విమల తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన

దేవరాపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పింఛన్‌దారులకు దంత సంరక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదిరెడ్డి చినకన్నబాబు, చిన్నంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వృద్ధాప్యంలో దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను దంత వైద్యులు పెనగంటి సింహాద్రినాయుడు వివరించారు. అలాగే వీరందరికీ భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన ఎ.కొత్తపల్లి భక్త బృందం

దేవరాపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి మండలంలోని ఎ.కొత్తపల్లి జైశ్రీరాం భక్త బృందం ఆదివారం బయలుదేరారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల వెంకరమణ తదితరులు ఈ బృందంతో పాటు బయలుదేరారు.

చెరకు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు

ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడ వరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల బకాయిలు క్రషింగ్ ప్రారంభం అయ్యేలోగా చెల్లించకపోతే కాటాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వ మాజీ విప్, వైసీపీ నాయకుడు కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోవాడ చెరకు రైతుల బకాయిలు దసరాలోగా చెల్లిస్తామని స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ, సంక్రాంతి వస్తున్నా నెరవేరలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గోవాడ ఫ్యాక్టరీపై ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించదన్నారు. చెరకు రైతుల బకాయిలు, ఫ్యాక్టరీ బాగోగుల గురించి కూటమినేతలు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. క్రషింగ్ ప్రారంభమయ్యేలోగా బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో రైతులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, బొడ్డేడ సూర్యనారాయణ, వెంపలి ఆనంద్, దేవరపల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ అథ్లెట్ ముత్యం లక్ష్మికి ఆర్థిక సాయం

చోడవరం, జవవరి 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వెటరన్ క్రీడా పోటీలకు ఎంపికైన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మికి స్థానిక సద్భావ టీం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 31 నుంచి మూడు రోజుల పాటు కేరళలో జరగనున్న జాతీయ స్థాయి వెటరన్ క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న ముత్యం లక్ష్మికి చార్జీల కోసం రూ.18 వేలు అందించారు. సబ్ రిజిస్ట్రార్లు మోహనరావు, నారాయణరావు, నరసయ్యపేట సర్పంచ్ నాగబాబు, సద్భావ టీం సభ్యులు గీతాలక్ష్మి, కొప్పాక రాజేశ్, గనిరెడ్డి, ఉప్పల రజని, కె.చలపతి, సూర్యకుమారి పాల్గొన్నారు.

భజన కళాకారుల సొమ్ము తిరిగి ఇవ్వాలి

మాకవరపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావం కార్యక్రమానికి వసూళ్లు చేసిన నగదును తిరిగి ఇవ్వాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ లగుడు సన్యాసినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ విజయవాడలో హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గ్రామాల్లో ఆర్ఎస్ఎస్ సభ్యులు సమావేశాలు నిర్వహించి రూ.300 చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. బూరుగుపాలెం, తూటిపాల, తాడపాల గ్రామాల్లో సుమారు 80 మంది భజన కళాకారులు రూ.300 చొప్పున చెల్లించారని చెప్పారు. కార్యక్రమానికి వెళ్లడానికి వారంతా సిద్ధమైనా బస్సు రాలేదన్నారు. దీనిపై ఆర్ఎస్ఎస్ సభ్యులకు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. భజన కళాకారుల నుంచి తీసుకున్న నగదును తిరిగి ఇచ్చి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జొన్నాడ


శ్రీనివాసరావు

చోడవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియోజకవర్గానికి చెందిన క్రీడాకారుడు జొన్నాడ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. నెల్లూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి జిల్లా తరపున శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు శ్రీనివాసరావుకు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.



మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి


సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు




సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద


హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే
ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం..
అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్లు అనుభవించారు
చెన్నైకి చెందిన **భాను సురేష్‌బాబు**. కష్టనష్టాలు
భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను
మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా
అనుభవించకూడదనే ఆలోచనతో...
డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి...
వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.
స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం
గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటు వైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా, చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!



తేనె

● ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేకులు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.



బెల్లం

● దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.



ఖర్జూరాలు

● కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

సంస్కృతి, సంప్రదాయాలకు జీవం

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు అభినందనీయం

▸▸ ఎ.డి. ఇంగ్లిషు మీడియం స్కూలు అధినేత కొణతాల రఘునాథ్

అనకాపల్లిటౌన్/కొత్తూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మరుగునపడిపోతున్న తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ, వాటికి జీవం పోసేలా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని ఎ.డి. ఇంగ్లిషు మీడియం స్కూలు అధినేత కొణతాల రఘునాథ్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్'... సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)' ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించారు. స్థానికంగా కొణతాల సుబ్రహ్మణ్యం అప్పలనర్సమ్మ ట్రస్టు వారు స్పాన్సర్‌గా వ్యవహరించారు. ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, పూర్వకాలంలో మన సంస్కృతికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని, కానీ ఆధునిక సాంకేతిక, పాశ్చాత్య మోజులోపడి మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహించడం, ఇందులో ఎంతో మంది మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా వుందన్నారు. వచ్చే ఏడాది ముగ్గుల పోటీలను మరింత భారీగా నిర్వహించడానికి తనవంతు చేయూతనిస్తానని హామీ ఇచ్చారు. ఎ.డి. స్కూలు డైరెక్టర్ పీలా అనుష సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ మాట్లాడుతూ, మహిళలు వేసిన ముగ్గులను చూస్తే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా ఉందన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన పోటీల్లో ముగ్గులను చూడగానే.. 15 సంవత్సరాల క్రితం మా తాతగారు కొణతాల సుబ్రహ్మణ్యం నిర్వహించిన రంగు రంగుల ముగ్గుల పండుగ గుర్తుకొచ్చిందన్నారు. స్కూలు ప్రిన్సిపాల్ జి.లక్ష్మి మాట్లాడుతూ, నువ్వు బతుకు, ఇంకొక జీవిని బతికించు అనే ఉద్దేశంతో ముగ్గులను వరి పిండితో వేస్తామని చెప్పారు. ఇంటి ముందు ముగ్గులు వేయడం వల్ల లక్ష్మీదేవి ఇంటిలోని వస్తుందని చాలా మంది నమ్ముతారని అన్నారు. ముగ్గుల పోటీల న్యాయనిర్ణేత నీలావతి మాట్లాడుతూ, గత 15 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ క్రమం తప్పకుండా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అంతకుముందు మహిళలు, యువతలు వేసిన రకరకాల రంగవల్లులను వీరు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అనకాపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ వెంకట్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి జె.శ్రీనివాస్, వివిధ విభాగాలకు చెందిన మద్దాల రాంబాబు, శశి, వెంకటేశ్, జాన్సన్, అప్పన్న, రాజేంద్ర, రఘు, ఏవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొణతాల రఘునాథ్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రఘునాథ్



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు



ముగ్గులను పరిశీలిస్తున్న ముఖ్యఅతిథి కొణతాల రఘునాథ్, అతిథులు పీలా అనుష సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, న్యాయనిర్ణేతలు



ద్వితీయ బహుమతిని అన్నపూర్ణకు అందజేస్తున్న శ్రీకాంత్



తృతీయ బహుమతిని యశ్వితకు అందజేస్తున్న పీలా అనుష సుబ్రహ్మణ్యం



ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న చిన్నారి, యువతులు